# ఇండియన్ పాలిటీ

## భారత ప్రధానమంత్రి

**భారత ప్రధానమంత్రి ప్రభుత్వాధినేత, వాస్తవ ముఖ్యకార్యనిర్వహణాధికారి. రాజ్యాంగంలోని V వ భాగంలో ఉన్న 74, 75, 78 నిబంధనలు ప్రధాని, మంత్రిమండలి గురించి వివరిస్తాయి. పార్లమెంటరీ సంప్రదాయం ప్రకారం దేశపరిపాలనలో అత్యంత ప్రముఖ స్థానం ప్రధానమంత్రిదే. ఐవర్‌జెన్నింగ్స్ అభిప్రాయంలో 'సౌర కుటుంబంలో సూర్యుడిలా ప్రధానమంత్రి మంత్రిమండలిలో ప్రకాశిస్తాడు'.**

### అర్హతలు

ప్రధానమంత్రి పార్లమెంటు సభ్యుడై ఉండాలి లేదా పార్లమెంటుకు ఎన్నికవడానికి అవసరమైన అర్హతలు ఉండాలి.

★ పార్లమెంటులో సభ్యత్వం లేకపోతే ప్రధానిగా నియమితుడైన రోజు నుంచి 6 నెలలలోపు పార్లమెంటుకు ఎన్నిక కావాల్సి ఉంటుంది. నిబంధన 75 (5) ప్రకారం మంత్రులు ఎవరైనా 6 నెలలపాటు పార్లమెంటు సభ్యులుగా లేకపోతే తమ పదవిని కోల్పోతారు. ఇదే నిబంధన ప్రధానమంత్రికీ వర్తిస్తుంది.

★ సాధారణంగా ప్రధానమంత్రిగా నియమితుడయ్యే వ్యక్తి లోక్‌సభ సభ్యుడిగా ఉంటారు. అయితే కొన్ని సందర్భాల్లో రాజ్యసభకు ఎన్నికైన/ నామినేటెడ్ సభ్యులు కూడా ప్రధానిగా పని చేశారు. ఇప్పటివరకు ఇందిరాగాంధీ (1966) హెచ్.డి. దేవెగౌడ (1996), ఐ.కె. గుజ్రాల్ (1997), మన్మోహన్‌సింగ్ (2004, 2009) రాజ్యసభ సభ్యులుగా ప్రధాని పదవిని నిర్వహించారు.

### నియామకం

రాజ్యాంగంలోని 75 (1) నిబంధన ప్రకారం ప్రధానమంత్రిని రాష్ట్రపతి నియమిస్తారు. ప్రధానమంత్రి నియామక పద్ధతిని రాజ్యాంగం వివరించలేదు. సాధారణంగా లోక్‌సభ ఎన్నికలు జరిగిన తర్వాత లోక్‌సభలో మెజారిటీ పార్టీ నాయకుడు లేదా అత్యధిక స్థానాలు పొందిన పార్టీ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్రపతి ఆహ్వానిస్తారు. ఏ పార్టీకీ మెజారిటీ రాని సందర్భంలో ఎన్నికలకు ముందు లేదా తర్వాత ఏర్పడిన సంకీర్ణ కూటమి సూచించిన వ్యక్తిని లేదా మెజారిటీ పొందగలడని, సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలడని రాష్ట్రపతి భావించిన వ్యక్తిని ప్రధానిగా నియమిస్తారు.

### పదవీ ప్రమాణస్వీకారం

రాజ్యాంగంలోని నిబంధన 75 (4) ప్రకారం ప్రధానితో సహా మంత్రులందరూ III వ షెడ్యూల్ ప్రకారం ప్రమాణస్వీకారం చేయాలి. ఇది రెండు రకాలుగా ఉంటుంది. (1) అధికారాలను సక్రమంగా నిర్వర్తించడం (2) అధికార రహస్యాలను కాపాడతానని ప్రమాణం చేయడం. అవి కింది విధంగా ఉంటాయి. (i) "............ అనే నేను రాజ్యాంగం పట్ల విశ్వాసం కలిగి ఉంటానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతలను పరిరక్షిస్తానని, ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా రాజ్యాంగబద్ధంగా, శాసనబద్ధంగా ప్రజలందరికీ న్యాయం చేస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను". (లేదా) (ii) "............ అనే నేను ప్రధానమంత్రిగా నాకు తెలిసిన విషయాలను, నా బాధ్యతలను నిర్వర్తించడంలో అవసరమైనప్పుడు మినహాయించి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎక్కడా బహిరంగపరచను".

### పదవీకాలం

సాధారణంగా ప్రధానమంత్రి పదవీకాలం అయిదు సంవత్సరాలు. అయితే రాజ్యాంగంలోని 75 (2) నిబంధన ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత కాలం ప్రధాని, మంత్రిమండలి తమ పదవుల్లో కొనసాగవచ్చు. కానీ ఆచరణలో 'లోక్‌సభ' విశ్వాసం ఉన్నంత కాలం పదవిలో కొనసాగగలరు. లోక్‌సభలో మెజారిటీ ఉన్నంతవరకు ప్రధానమంత్రిని తొలగించే అవకాశమే లేదు. అయితే స్వయంగా ప్రధానమంత్రి రాజీనామా చేయొచ్చు. రాజీనామాను రాష్ట్రపతి పేరుమీద రాసి, రాష్ట్రపతికే సమర్పించాల్సి ఉంటుంది. కింది సందర్భాల్లో ప్రధానమంత్రి తన పదవి నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది.

★ లోక్‌సభలో విశ్వాస తీర్మానం నెగ్గనప్పుడు, అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు

★ లోక్‌సభ ఆర్థిక బిల్లు/ ప్రభుత్వ బిల్లును తిరస్కరించినప్పుడు

★ లోక్‌సభలో కోత తీర్మానం నెగ్గినప్పుడు

★ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం తిరస్కరణకు గురైనప్పుడు

★ పార్లమెంట్‌లో ప్రభుత్వం వ్యతిరేకించినప్పటికీ ప్రైవేట్ బిల్లు ఆమోదం పొందినప్పుడు

★ ఏ కారణంగానైనా లోక్‌సభ రద్దయితే ఆ వ్యక్తినే ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగించి, పరిపాలన చేయవచ్చు. కానీ విధాన నిర్ణయాలు

చేయకూడదని యూఎన్ఆర్ రావు Vs ఇందిరాగాంధీ కేసు (1971) లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

### జీతభత్యాలు

ప్రధానమంత్రి, మంత్రుల జీతభత్యాలను నిర్ణయించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది.

★ ప్రస్తుతం ప్రధానికి రూ. 1,60,000 నెలసరి వేతనం భత్యాల రూపంలో అందుతోంది (రూ. 50,000 వేతనం + రూ. 1,10,000 అలవెన్సులు).

### అధికారాలు - విధులు

భారత ప్రధానమంత్రి కేంద్ర ప్రభుత్వంలో అపారమైన అధికారాలను, అసంఖ్యాక విధులను కలిగి ఉంటాడు.

### కేంద్ర కేబినెట్ నాయకుడు

రాజ్యాంగంలోని 75(1) నిబంధన ప్రకారం ప్రధానమంత్రి సలహా మేరకు మంత్రిమండలి సభ్యులను లేదా మంత్రులను రాష్ట్రపతి నియమిస్తారు.

(i) మంత్రులకు శాఖల కేటాయింపు, శాఖలను మార్చడం, అవసరమైతే మంత్రులను మంత్రిమండలి నుంచి తొలగించడం, మంత్రిమండలిలో ఉండాల్సిన సభ్యుల సంఖ్య మొదలైనవి ప్రధాని ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటాయి. అయితే 91 వ రాజ్యాంగ సవరణ చట్టం, 2003 ప్రకారం కేంద్ర మంత్రిమండలి సంఖ్య ప్రధానమంత్రితో సహా లోక్‌సభ మొత్తం సభ్యుల సంఖ్యలో 15% కి మించకూడదు. ఈ మేరకు రాజ్యాంగంలోని 75(1) (A) క్లాజును చేర్చారు.

(ii) మంత్రిమండలి సమావేశాలకు ప్రధాని అధ్యక్షత వహిస్తాడు. మంత్రివర్గ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాల 'ఎజెండా'ను నిర్ణయిస్తాడు.

(iii) మంత్రిమండలి సభ్యుల కార్యకలాపాలను ప్రధాని సమన్వయం చేస్తాడు. మంత్రిమండలి ప్రధానమంత్రి మార్గదర్శకత్వంలో పనిచేస్తుంది.

(iv) అవసరమైతే మంత్రిని/ మంత్రులను రాజీనామా చేయమని ప్రధాని కోరగలడు. రాజీనామా చేయకపోతే ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి వారిని తొలగించవచ్చు.

(v) ప్రధానమంత్రి రాజీనామా చేస్తే మొత్తం మంత్రిమండలి రాజీనామా చేసినట్లే అవుతుంది. కాబట్టి కేంద్ర మంత్రిమండలి జీవం, మరణం, మనుగడ ప్రధానిపై ఆధారపడి ఉంటాయి.

లార్డ్ మోర్లే 'ప్రధానమంత్రి కేబినెట్ సౌధానికి మూలస్తంభం' అని అభివర్ణించారు.

### రాష్ట్రపతి - కేంద్ర మంత్రిమండలి

రాజ్యాంగంలోని 74(1) నిబంధన ప్రకారం రాష్ట్రపతికి తన విధి నిర్వహణలో సహాయం, సలహాలు అందించడానికి ప్రధాని నాయకత్వంలో మంత్రిమండలి ఉంటుంది. వీరి సలహా ప్రకారమే రాష్ట్రపతి తన విధులను నిర్వహించాల్సి ఉంటుంది.

★ రాయ్ సాహెబ్ రామ జవాయ కపూర్ Vs పంజాబ్ రాష్ట్రం కేసు (1955)లో మంత్రిమండలి సలహాకు అనుగుణంగానే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇదే అభిప్రాయాన్ని యూఎన్ఆర్ రావు Vs శ్రీమతి ఇందిరా గాంధీ కేసు (1971), షంషేర్ సింగ్ Vs పంజాబ్ రాష్ట్రం (1974) కేసుల్లో సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది.

★ ప్రధానమంత్రి రాష్ట్రపతికి ప్రధాన సలహాదారుడు. రాజ్యాంగ నిబంధన 78 ప్రకారం మంత్రివర్గ నిర్ణయాలను రాష్ట్రపతికి తెలియజేయడం ప్రధానమంత్రి బాధ్యత. అదే విధంగా రాష్ట్రపతి అభిప్రాయాలను ప్రధానమంత్రి తన మంత్రి వర్గ సహచరులకు తెలియజేస్తాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని వివిధ ఉన్నతాధికారుల నియామకానికి రాష్ట్రపతికి సలహా ఇస్తాడు. ఉదాహరణకు భారత అటార్నీ జనరల్, కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఎన్నికల సంఘం, ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యులు, న్యాయమూర్తులు, గవర్నర్ల నియామకం.

### ప్రభుత్వాధినేత

ప్రధానమంత్రి కేంద్ర ప్రభుత్వ వాస్తవ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ప్రభుత్వ విధానాలను పార్లమెంటులో ఆమోదం పొందేలా చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తారు. ఉదాహరణకు వస్తు, సేవల పన్ను (GST) బిల్లు పార్లమెంటు ఆమోదం పొందడం (2016). మొత్తం మంత్రిమండలి, కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు ప్రధాని అభిప్రాయాలకు అనుగుణంగా తమ విధులను నిర్వర్తిస్తారు.

### లోక్‌సభ నాయకుడు

ప్రధాని లోక్‌సభ నాయకుడు.

(i) పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేయడం, వాయిదా వేయడం లాంటివి ప్రధాని సలహా ప్రకారం రాష్ట్రపతి అమలు చేస్తారు.

(ii) లోక్‌సభను రద్దు చేయాల్సిందిగా రాష్ట్రపతికి సలహా ఇచ్చే అధికారం ప్రధానికి ఉంటుంది.

(iii) పార్లమెంటు సమావేశాల నిర్వహణలో సభాధిపతులకు తగిన సహకారాన్ని అందిస్తాడు.

(iv) మంత్రిమండలి నిర్ణయాలను లేదా ప్రభుత్వ నిర్ణయాలను పార్లమెంటులో అధికారికంగా ప్రకటిస్తాడు.

(v) దేశ, విదేశీ సమస్యలపై పార్లమెంటులో చర్చిస్తాడు.

## మెజారిటీ పార్టీ నాయకుడు

ప్రధాని లోక్‌సభలో మెజారిటీ పార్టీ నాయకుడు. అధికార పార్టీ విధానాలను, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను చట్టబద్ధంగా అమలు చేయడానికి కృషిచేస్తాడు.

## జాతి నాయకుడు

ప్రధానిని భారత జాతికి నాయకుడిగా పరిగణిస్తారు. ప్రధాని లోక్‌సభకు నాయకుడు కావడం, లోక్‌సభ దేశం మొత్తం ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం వల్ల ప్రధాని అభిప్రాయాలను జాతి అభిప్రాయాలుగా పరిగణిస్తారు.

## నీతి ఆయోగ్ ఛైర్మన్

ప్రధానమంత్రి పదవిరీత్యా నీతి ఆయోగ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సహకార సమాఖ్య విధానానికి చిహ్నమైన నీతి ఆయోగ్ ద్వారా రాష్ట్రాలను భాగస్వాములను చేయడం ద్వారా, దేశాభివృద్ధికి అవసరమైన ఆర్థిక విధాన నిర్ణయాలను తీసుకోవడంలో ప్రధాని కృషి చేస్తారు.

## అంతర్జాతీయ సంబంధాలు

అంతర్జాతీయంగా దేశ గౌరవ, ప్రతిష్ఠలు, వర్తక, వాణిజ్య సంబంధాలు తద్వారా దేశ ప్రగతి ప్రధానమంత్రి సమర్థతపై ఆధారపడి ఉంటాయి. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అలీన విధానం, పంచశీల విధానాల రూపకల్పనలో ప్రముఖపాత్ర పోషించారు. అదే విధంగా ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, అంతర్జాతీయంగా భారతదేశ ప్రాబల్యాన్ని విస్తరించడానికి విశేషంగా కృషి చేస్తున్నారు.

## మాదిరి ప్రశ్నలు

**1.** రాజ్యసభకు నియమితులై (ఎన్నిక కాదు) ప్రధానమంత్రి పదవి చేపట్టినవారు?

ఎ) ఇందిరాగాంధీ బి) హెచ్.డి. దేవెగౌడ సి) ఐ.కె. గుజ్రాల్ డి) మన్మోహన్‌సింగ్

**2.** కిందివాటిలో ఏ షెడ్యూల్ ప్రధానమంత్రి, మంత్రిమండలి ప్రమాణస్వీకారం గురించి తెలియజేస్తుంది?

ఎ) I బి) II సి) III డి) IV

**3.** ప్రధానమంత్రి ఏయే సందర్భాల్లో రాజీనామా చేయాల్సి ఉంటుంది?

ఎ) లోక్‌సభలో విశ్వాస తీర్మానం నెగ్గనప్పుడు

బి) లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు

సి) లోక్‌సభలో కోత తీర్మానం నెగ్గినప్పుడు

డి) ఎ, బి, సి సరైనవి

**4.** భారతదేశంలో మొదటిసారిగా లోక్‌సభను మధ్యంతరంగా రద్దు చేయడానికి సలహా ఇచ్చిన ప్రధాని?

ఎ) జవహర్‌లాల్ నెహ్రూ బి) లాల్‌బహదూర్ శాస్త్రి

సి) శ్రీమతి ఇందిరాగాంధీ డి) ఎ.బి. వాజ్‌పేయీ

5. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న కాలంలో వయోజన ఓటుహక్కు వయోపరిమితిని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు?

ఎ) 58 వ రాజ్యాంగ సవరణ చట్టం    బి) 61 వ రాజ్యాంగ సవరణ చట్టం

సి) 52 వ రాజ్యాంగ సవరణ చట్టం    డి) 67 వ రాజ్యాంగ సవరణ చట్టం

6. ఒక పార్లమెంటు సభ్యుడిని అనర్హుడిగా ప్రకటించడానికి నిబంధన 103(2) ప్రకారం రాష్ట్రపతి ఎవరి సలహాను పాటించాలి?

ఎ) ప్రధానమంత్రి    బి) మంత్రిమండలి    సి) ఎన్నికల సంఘం    డి) విచక్షణాధికారం

7. 'కేబినెట్' అనే పదాన్ని 44 వ రాజ్యాంగ సవరణ చట్టం (1978) ద్వారా రాజ్యాంగంలోని ఏ నిబంధనలో చేర్చారు?

ఎ) నిబంధన 352    బి) నిబంధన 74    సి) నిబంధన 75    డి) నిబంధన 78

8. రాజ్యాంగంలోని ఏ నిబంధన ప్రధానమంత్రి మంత్రిమండలికి అధ్యక్షుడని తెలుపుతుంది?

ఎ) 74    బి) 75    సి) 78    డి) 52

9. స్వాతంత్ర్యానంతరం జన్మించి, ప్రధానమంత్రి పదవి చేపట్టిన ఏకైక వ్యక్తి ఎవరు?

ఎ) రాజీవ్‌గాంధీ    బి) నరేంద్ర మోదీ

సి) ఇందిరాగాంధీ    డి) మన్మోహన్ సింగ్

10. 'The Insider' (ది ఇన్‌సైడర్) పేరుతో ఆత్మకథ రాసిందెవరు?

ఎ) ఐ.కె. గుజ్రాల్    బి) నరేంద్ర మోదీ

సి) మన్మోహన్ సింగ్    డి) పి.వి. నరసింహారావు

11. కేంద్ర మంత్రిమండలి లోక్‌సభకు సమష్టిగా బాధ్యత వహించాలని తెలిపే రాజ్యాంగ నిబంధన ఏది?

ఎ) 74(1)    బి) 75(1)    సి) 75(3)    డి) 75(4)

**జవాబులు**

1-ఎ; 2-సి; 3-డి; 4-సి; 5-బి; 6-సి; 7-ఎ; 8-ఎ; 9-బి; 10-డి 11-సి.

రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు

www.eenadupratibha.net